సాక్షి
వికారాబాద్
సోమవారం । 27 । జనవరి । 2025



దళారుల ప్రమేయం

దళారుల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. 8లో▸



ప్రజా సంక్షేమమే..

పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. 8లో▸



అరెస్టులు బాధాకరం

అక్రమ అరెస్టులు బాధాకరమని సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా అధ్యక్షుడు గాంగ్యానాయక్ అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ప్రత్యేకాధికారిగా అడిషనల్ కలెక్టర్

తాండూరు: తాండూరు మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా అడిషనల్ కలెక్టర్(లోకల్‌బాడి) సుధీర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదివారంతో మున్సిపల్ పాలకవర్గం గడువు ముగిసింది. దీంతో ఐదేళ్ల పాటు కొనసాగిన చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్, వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీప, మిగతా 34 మంది కౌన్సిలర్లు మాజీలు అయ్యారు. దీంతో చైర్‌పర్సన్ స్థానంలో ప్రత్యేకాధికారిగా సుధీర్‌ను నియమించారు. ఆయన తాండూరుతో పాటు.. వికారాబాద్, పరిగి, కొడంగల్ పురపాలకలకు ప్రత్యేకాధికారిగా కొనసాగుతారు.

ఎన్నికల హామీలు అమలు చేస్తున్నాం



లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

శంషాబాద్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలకు అమలుకు చర్యలు చేపట్టిందని ఎమ్మెల్సీ, మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నాలుగు పథకాలను ఆదివారం ఆయన మండలంలోని సుల్తాన్‌పల్లిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రెండు హామీలను అమలు చేసిందని, మిగిలిన హామీలను అమలు చేయడం సంతోషంగా ఉందన్నారు. గ్రామస్తులకు 76వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయనడానికి సుల్తాన్‌పల్లి ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్‌దత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరుద్ర సహిత శతచండీ యాగం

కందుకూరు: మండలంలోని దాసర్లపల్లి సమీపంలోని శ్రీమాత క్షేత్రంలో చండీ ఉపాసకులు రేవెళ్ల రాజుశర్మ ఆధ్వర్యంలో 108 యజ్ఞగుండాలతో చేపట్టిన శ్రీరుద్ర సహిత శత చండీ యాగం వైభవంగా ప్రారంభమైంది. ఉదయం గోపూజ, ధ్వజారోహణం, యాగశాల ప్రవేశంతో ప్రారంభించారు. సాయంత్రం శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం, సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అన్న ప్రసాదం అందించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మున్సిపల్ పాలకవర్గానికి ఘనంగా సత్కారం

ఆమనగల్లు: మున్సిపల్ పాలకవర్గ పదవీ కాలం పూర్తికావడంతో కమిషనర్ వసంత ఆధ్వర్యంలో ఘన సత్కారం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లను కమిషనర్ వసంత సత్కరించారు. రాంపాల్‌నాయక్ మాట్లాడుతూ. ఐదేళ్లు ఆమనగల్లు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని చెప్పారు. సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు

మొయినాబాద్: అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్‌లో ఆదివారం ప్రజాపాలన ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తామన్నారు. అర్హులు ఎవరికైనా పథకాలు రాకుంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. వెంటనే అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కిషన్‌రావు, తహసీల్దార్ గౌతంకుమార్, ఎంపీడీఓ సంధ్య, ఏఓ అనురాధ, ఎంపీఓ వెంకటేశ్వరరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వినోద్, ఆర్‌ఐ సుజిత్‌రెడ్డి, ఏఈఓలు సునీల్, కుమార్, మాజీ సర్పంచ్ మనోజ్‌కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యులు రాంరెడ్డి, లక్ష్మణ్, యాదయ్య, శంకర్ పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



మాట్లాడుతున్న కలెక్టర్



అందరికీ సంక్షేమ ఫలాలు

రాజ్యాంగ లక్ష్యాలు.. ఆశయాలకు అనుగుణంగా ప్రజాపాలన



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్
- ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సుదీర్ఘ ప్రసంగం
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

వికారాబాద్: స్వాతంత్ర్య ఫలాలు, రాజ్యాంగం నిర్దేశించిన లక్ష్యాలు, సంక్షేమ పథకాలు ప్రజలందరికీ దక్కేలా ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎస్పీ నారాయణరెడ్డితో కలిసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన 128 మంది అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ద్వారా 2,308 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజి రుణాలు రూ.219.82 కోట్ల విలువ చేసే చెక్కులు పంపిణీ చేశారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ద్వారా 346 సంఘాలకు రూ.43.50 కోట్ల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పోలీసులు పరేడ్‌తో ఆకట్టుకున్నారు. వికారాబాద్ జెడ్పీహెచ్‌ఎస్ బాలికలు, కొత్తగడి, మోమిన్‌పేట బాలికల గురుకుల, కేజీబీవీ వికారాబాద్, సంఘం లక్ష్మీబాయి పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించగా.. వారికి కలెక్టర్, ఎస్పీ, అడిషనల్ కలెక్టర్ జ్ఞాపికలు అందజేశారు. అనంతరం సంక్షేమ పథకాల గురించి కలెక్టర్ ప్రసంగించారు. ఆయన మాటల్లోనే..

ప్రజా సంక్షేమమే లక్ష్యం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ పాలన కొనసాగుతుంది. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల్లో రెండు పథకాలు మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలు కొనసాగుతున్నాయి. మహాలక్ష్మి ప్రారంభం నుంచి ఇప్పటి వరకు జిల్లాలో ఆర్టీసీ బస్సుల్లో 2.70 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారు. అందుకు ప్రభుత్వం రూ.98 కోట్లు ఖర్చు చేసింది. రూ.500 గ్యాస్ పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకు 1.17 లక్షల మంది 2.82 లక్షల సిలిండర్లు వినియోగించుకోగా, అందుకోసం ప్రభుత్వం రూ.7.36 కోట్లు ఖర్చు చేసింది. గృహజ్యోతి ద్వారా 1.36 లక్షల వినియోగదారులకు జీరో బిల్లు వర్తింపజేస్తూ రూ.30.06 కోట్లను ప్రభుత్వం డిస్కంలకు చెల్లించింది. రైతుబీమా పథకం ద్వారా జిల్లాలో 394 మంది రైతులకు రూ.19.90 కోట్లు, రుణమాఫీ ద్వారా 1,00,358 మంది రైతులకు రూ.849.30 కోట్లు ప్రభుత్వం మాఫీ చేసింది. వీటితో పాటు కొత్తగా నాలుగు పథకాలను అమలు చేయనుంది.

ఆందోళన వద్దు..

సంక్షేమ పథకాల అర్హుల జాబితాలో పేర్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందవద్దు. అర్హులందరికీ లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ ధ్యేయం. పథకాల అమలు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. గణతంత్ర దినోత్సవాన ప్రారంభించిన రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు పారదర్శకంగా అర్హులను గుర్తించాం. సాగు భూములకు ఎకరాకు ఏడాదికి రూ.12 వేల సాయం చొప్పున ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తుంది. సాగు భూమి లేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో ఏడాదికి రూ.12 వేలు ఇవ్వనుంది. అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనుంది.

వైద్య, విద్యారంగంపై దృష్టి

వైద్య, విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే ఆరోగ్యశ్రీకి రూ.10 లక్షలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకు 15,600 మందికి రూ.42.55 కోట్లతో వైద్య సేవలు అందించింది. అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా జిల్లాలో 1,062 పాఠశాలలకు గాను 924 పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.17.55 కోట్లు వెచ్చించి, పనులు పూర్తి చేసింది. పాఠశాలల్లో వేద గణితం కార్యక్రమం అమలు చేసింది. విద్యార్థుల్లో ఆంగ్ల నైపుణ్యాభివృద్ధికి యంగ్ ఆపరేటర్స్ క్లబ్ ద్వారా ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించాము.

51,784 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

జిల్లాలో 126 కొనుగోలు కేంద్రాల ద్వారా 51,784 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి ప్రభుత్వం సేకరించింది. ఇందుకోసం రూ.120 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసింది. సన్న రకం సాగును ప్రోత్సహించేందుకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ రైతులకు అందించింది. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్‌ను ప్రోత్సహిస్తున్నాం. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా జిల్లాలో రూ.124 కోట్లతో 256 రోడ్ల పనులు పూర్తి చేశాం. రోడ్లు భవనాల శాఖ ద్వారా కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.1473 కోట్లు మంజూరు కాగా.. వీటితో విద్య, వైద్య శాఖల భవనాలు నిర్మించనున్నాం. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

సమష్టిగా అభివృద్ధి చేద్దాం



మహిళలకు ఆత్మీయ భరోసా చెక్కు అందజేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకుందాం
- అభివృద్ధిని అడ్డుకుంటున్న బీఆర్‌ఎస్
- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

కొడంగల్: 'స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి కొడంగల్ నియోజకవర్గం వెనుకబాటుకు గురైంది. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఇప్పుడు అవకాశం వచ్చింది. ఇప్పుడు కాకుంటే మరోసారి అవకాశం రాకపోవచ్చు. అందరం కలిసి కట్టుగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందాం' అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. కొత్త పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ ప్రక్రియను ఆదివారం కోస్గి మండలం చంద్రవంచ గ్రామంలో ప్రారంభించారు. అర్హులకు సంక్షేమ పథకాల పత్రాలను అందజేసి మాట్లాడారు. కొడంగల్ ప్రజల ఆశీర్వాదంతోనే తనకు ఈ పదవి దక్కిందని, తాను ఈ హోదాలో ఉన్నన్ని రోజులు కొడంగల్ ప్రతి పౌరుడు ముఖ్యమంత్రిగానే భావించాలని సూచించారు. ప్రాంత ప్రజల మేలుకోసం రూ.5వేల కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించానని సీఎం తెలిపారు. కొడంగల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ప్రజలకు హామీ ఇచ్చారు.

కోస్గిలో మహిళా డిగ్రీ కళాశాల

కోస్గి పాలిటెక్నిక్ కళాశాలను అప్‌గ్రేడ్ చేసి, ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలగా మార్చామని, మహిళా డిగ్రీ కళాశాలను మంజూరు చేశామని ముఖ్యమంత్రి రేవంత్ పేర్కొన్నారు. దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండల కేంద్రాల్లో జూనియర్ కళాశాలల, కొడంగల్‌కు మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, ఫిజియోథెరపీ, పారామెడికల్ కళాశాలలను మంజూరు చేశామని వెల్లడించారు. కొడంగల్ ప్రభుత్వాసుపత్రిని విస్తరించి, 220 బెడ్ల సామర్థ్యం కలిగిన టీచింగ్ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశామని తెలిపారు.

1.5లక్షల ఎకరాలకు సాగునీరు

కొడంగల్- నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రూ.3వేల కోట్లు మంజూరు చేసి కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లో లక్షా 5వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని సీఎం చెప్పారు. సాంఘిక సంక్షేమ శాఖ, మైనార్టీ వెల్ఫేర్, బీసీ సంక్షేమ శాఖ, ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాలకు సకల సౌకర్యాలతో కూడిన కొత్త భవనాలు మంజూరు చేశామని తెలిపారు. రోడ్లు భవనాలు, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ శాఖలకు నిధులు, కొడంగల్ అంబేడ్కర్ కూడలి విస్తరణ, మున్సిపల్ కార్యాలయానికి నూతన భవనం, క్రీడా ప్రాంగణం, ఇండోర్ స్టేడియం, స్పోర్ట్స్ కోచింగ్ సెంటర్, వేంకటేశ్వర స్వామి ఆలయం అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్ సిస్టం తదితర పనులకు నిధులు మంజూరు చేశామని వెల్లడించారు. నియోజకవర్గంలో రోడ్ల విస్తరణకు రూ.344 కోట్లు, పాఠశాల భవనాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.30 కోట్లు కేటాయించామన్నారు. కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకుంటున్నాం

- ఎవరూ అధైర్య పడొద్దు.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



అర్హులకు సంక్షేమ పథకాల పత్రాలను అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: గత ప్రభుత్వం చేసిన అప్పులతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉందని, అయినా.. ప్రజలకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ సర్కార్ నిలబెట్టుకుంటుందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. పదేళ్ల కాలంలో నాటి పాలకులు ఏ ఒక్కరికీ రేషన్ కార్డు ఇవ్వలేదని, తాము పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. ఆదివారం వికారాబాద్ మండలం పెండ్లిమడుగులో ప్రజాపాలనలో భాగంగా నాలుగు పథకాలను ప్రారంభించారు. లబ్ధిదారులకు రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల పత్రాలు అందజేసి మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

ప్రజల ఆశీర్వాదంతో..

ప్రాంత ప్రజల ఆశీర్వాదంతోనే ఈ స్థాయిలో ఉన్నానని స్పీకర్ అన్నారు. అనంతగిరిని రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, దీంతో సుమారు 2,3 వేల మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఈ ప్రాంతానికి నీళ్లు తీసుకువచ్చే ప్రయత్నం చేయలేదని, పాలమూర్- రంగారెడ్డి పథకం కింద తాగు, సాగునీరు అందిస్తామన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలోని చెరువుల ఆధునికీకరణకు నిధులు కేటాయిస్తామని, కోట్‌పల్లి ప్రాజెక్టు సుందరీకరణకు రూ.120 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.

రూ.10 లక్షలతో ఫార్మేషన్ రోడ్డు

పెండ్లిమడుగు- చిట్టిగిద్ద వరకు రోడ్డుకు నిధులను 40రోజుల్లో మంజూరు చేయిస్తానని స్పీకర్ చెప్పారు. పొలాలకు వెళ్లేందుకు రైతులకు ఇబ్బందిగా ఉందని, రూ.10 లక్షలతో ఫార్మేషన్ రోడ్డును మంజూరు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సుధీర్, హౌసింగ్ పీడీ కిష్టయ్య, ఆర్‌టీఏ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మైపాల్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, లైబ్రరీ మాజీ చైర్మన్ ఎండీ హాఫీజ్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఎంపీఓ దయానంద్, ఏఓ ప్రసన్నలక్ష్మి, ఏపీఓ శీను తదితరులు పాల్గొన్నారు.

పేరులేదని ఆందోళన వద్దు..

- మళ్లీ దరఖాస్తు చేసుకోండి
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్ రూరల్: సంక్షేమ పథకాల అర్హుల జాబితాలో పేరు లేదని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా.. మరోసారి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలిపారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మండల పరిధి అన్నారం గ్రామంలో నాలుగు నూతన పథకాలను ఆయన ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. ఇందులో 294 మందికి ఇందిరమ్మ ఇళ్లు, 13 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 159 మందికి రేషన్ కార్డులు, 962 మందికి రైతులకు రైతుభరోసా పథకాల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, డీఎఫ్‌ఓ, మండల ప్రత్యేక అధికారి జ్ఞానేశ్వర్, తహసీల్దార్ బి.విజయకుమార్. ఏడీఏ శంకర్ రాథోడ్, ఎంపీడీఓ ఉషశ్రీ, సీఐ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పథకాల మంజూరు పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

నందిగామ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని విడతల వారీగా నెరవేర్చుకుంటూ పోతున్నామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు పథకాలను ఆదివారం మండల పరిధిలోని అప్పారెడ్డిగూడలో ప్రారంభించారు. లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేసిన అనంతరం మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉన్నా ఏ ఒక్కరికీ రేషన్ కార్డు, డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వలేకపోయిందని విమర్శించారు. ఏ మాత్రం అభివృద్ధి లేకుండా రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్ని కష్టాలు ఎదురైనా ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. కాంగ్రెస్ అంటే మాట తప్పని పార్టీ అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేవలం కల్వకుంట్ల కుటుంబ సభ్యులే పాలించారని, కాంగ్రెస్ పాలనలో అన్ని మతాలు, కులాలు, వర్గాలను కలుపుకొని పోతున్నట్టు పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు మాత్రమే కాకుండా రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తామని ఆయన వివరించారు. సంక్షేమ ఫలాలు అందించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. మాట తప్పని, మడమ తిప్పని నేతగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఏ విధంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టారో అదే విధంగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం పని చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో రాజసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనా రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ప్రతాప్‌రెడ్డి, బీష్వ కిష్టయ్య, కృష్ణారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహ యాదవ్, తహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీడీఓ సుమతి, ఏఓ వాణి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు చంద్రపాల్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

టీపీసీసీ చీఫ్‌కు ఘన స్వాగతం

షాద్‌నగర్: ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్‌కు ఆదివారం షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు స్వాగతం పలికారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన ఆయనను ఘనంగా సత్కరించారు. క్యాంపు కార్యాలయంలో మధ్యాహ్న భోజనం ముగించుకొని ఆయా పథకాలను ప్రారంభించేందుకు ఆయన నందిగామ మండలం అప్పారెడ్డిగూడ గ్రామానికి భారీ ర్యాలీతో తరలివెళ్లారు.

క్లుప్తంగా

ఆరోగ్య ఉప కేంద్రం ముందు ఎగరని జెండా

దుద్యాల్: మండలం పరిధి హస్నాబాద్ గ్రామ ఆరోగ్య ఉపకేంద్రం ఆవరణలో త్రివర్ణ పతాకం ఎగురలేదు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఎదుట జాతీయ పతాకం ఆవిష్కరించడం ఆనవాయితీ. ఇక్కడ మాత్రం జెండా రెపరెపలు కానరాలేదు. ఇదే విషయమై.. సబ్ సెంటర్ డాక్టర్ నిర్మలను వివరణ కోరగా.. సమాధానం దాటవేశారు. పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ విద్యను సంప్రదించగా ఉప కేంద్రాల్లో జెండా ఎగురవేయాలనే నిబంధన లేదని పేర్కొన్నారు. ఏది ఏమైనప్పటికీ.. కార్యాలయం ఎదుట జెండా ఎగరకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలి

రజక సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు



మాట్లాడుతున్న సంఘం నాయకులు

కొడంగల్ రూరల్: నియోజకవర్గంలో చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దలాల రాములు, నియోజకవర్గ ఇన్‌చార్జి రాధాకృష్ణ కోరారు. ఆదివారం పట్టణంలోని మహాదేవుని ఆలయ ఆవరణలో సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. రజకులు విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలతో పాటు అన్ని రంగాల్లో రాణించేందుకు సంఘటితంగా మెలగాలని సూచించారు. అనంతరం సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హస్నాబాద్ వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ తాండూరు కృష్ణ, దౌల్తాబాద్ మండల కార్యదర్శి మల్కప్ప, పరిగి ఆంజనేయులు, కృష్ణ, నర్సింహులు, నాగప్ప, టౌన్ అధ్యక్షుడు ముత్యప్ప, గౌరవ అధ్యక్షుడు చంద్రప్ప, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు చోరీ



సీసీ కెమెరా బాక్స్‌ను ధ్వంసం చేసిన దుండగులు

తాండూరు రూరల్: విద్యుత్ స్తంభాలకు ఉన్న సీసీ కెమెరాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీచేసి.. ధ్వంసం చేశారు. ఈ సంఘటన పెద్దేముల్ మండలం నాగులపల్లి గ్రామంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గతేడాది అక్టోబర్ 29న దాతల సహకారంతో గ్రామంలో రూ.3 లక్షలతో 31 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా.. అంబేడ్కర్ కూడలిలోని విద్యుత్ స్తంభం సీసీ కెమెరాలను ఎత్తుకెళ్లి, సామగ్రిని ధ్వంసం చేశారు. గ్రామస్తులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ బాలకృష్ణరెడ్డి తెలిపారు.

మాంసం దుకాణదారులకు జరిమానా

శంకర్‌పల్లి: నిబంధనలు అతిక్రమించి మాంసం విక్రయించిన వ్యాపారులకు మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. చేవెళ్ల రోడ్డులోని రెండు చికెన్ దుకాణాలు, సంగారెడ్డి రోడ్డులోని ఒక మటన్ దుకాణానికి రూ.9వేల(మూడింటికి కలిపి) జరిమానా వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవం రోజున మాంసం విక్రయాలు జరపకూడదని దుకాణదారులకు ముందే నోటీసులు అందజేశామని తెలిపారు.

ఉత్తమ సేవకులకు పురస్కారాలు

విధినిర్వహణలో జవాబుదారిగా సేవలు అందించడంతో పాటు.. ప్రజలు, ఉన్నతాధికారుల మన్ననలు పొందిన ఉత్తమ సేవకులకు అవార్డులు, ప్రశంసాపత్రాలు వరించాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులకు.. కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి తదితర అధికారులు.. ప్రశంసాపత్రాలు, అవార్డులు అందజేశారు. – సాక్షి, నెట్‌వర్క్



తాండూర్ సబ్ కలెక్టర్‌కు అవార్డు అందజేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



వికారాబాద్ ఆర్‌డీఓ వాసుచంద్ర



ఎస్సీ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి మల్లేశం



డీవైఎస్‌ఓ హన్మంతరావు



డీఈఓ రేణుకాదేవి



సీపీఓ అశోక్



డీపీఓ జయసుధ



వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి



సీసీఎస్ సీఐ బలవంతయ్య



తాండూర్ సీఐ సంతోష్‌కుమార్



కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి



శ్రీనివాస్ టైపిస్టు(డీపీఆర్‌ఓ కార్యాలయం)



ధారూరు ఎస్ఐ వేణుగోపాల్



కరణ్‌కోట ఎస్ఐ విఠల్‌రెడ్డి



ధారూరు డిప్యూటీ ఫారెస్టు రేంజర్ హేమ



కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్



నవాబుపేట ఎంపీడీఓ అనురాధ



నవాబుపేట డీఈ మాధవరెడ్డి



పూడూరు కానిస్టేబుల్ నగేష్

వర్గీకరణతో మాదిగలకు న్యాయం

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర్‌రావు మాదిగ

చేవెళ్ల: మాదిగల సమస్యలను పరిష్కరించటంతో పాటు జాతి ఐక్యత కోసమే ఎమ్మార్పీఎస్ పని చేస్తోందని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి క్యాసారం శంకర్‌రావుమాదిగ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ ఏర్పాటుతో మాదిగలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎమ్మార్పీఎస్ చేవెళ్ల గ్రామ నూతన కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా యాదయ్య, ఉపాధ్యక్షుడిగా దయాకర్, కార్యదర్శులుగా రాజు, వెంకటేశ్, కోశాధికారిగా బాలక్రిష్ణ, అధికార ప్రతినిధిగా శ్రీనివాసులు, సలహాదారులుగా బుచ్చయ్య, జగన్నాథం, వెంకటయ్య, శ్రీనివాస్, మానిక్యం, మహేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాదిగ నాయకులు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

కడ్తాల్: మండలంలోని కొండ్రిగాన్‌బోడ్ పంచాయతీ పరిధిలోని పెద్దారెడ్డి చెరువుతండాకు చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన నేనావత్ వెంకటయ్యానాయక్‌కు భార్య శాంతితో పాటు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆయన సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 23న కుటుంబ విషయంలో భార్యతో గొడవ పడ్డాడు. తన బైక్, సెల్‌ఫోన్ ఇంట్లో వదిలిపెట్టి ఎవరికీ చెప్పకుండా వెంకటయ్యానాయక్ వెళ్లిపోయాడు. ఆచూకీ కోసం వెతికినా లభించలేదు. ఈ మేరకు ఆదివారం ఆయన భార్య శాంతి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

ట్రాక్టర్‌పై విరిగిపడిన స్తంభం

ఇద్దరికి గాయాలు

యాలాల: విద్యుత్‌స్తంభం విరిగి ఓ ట్రాక్టర్‌పై పడింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. మండల పరిధి అగ్గనూరు గ్రామం 8వ వార్డులో ఇటీవల పాత విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి అమర్చారు. కానీ పాత వాటిని తొలగించలేదు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం శిథిలావస్థలో ఉన్న పోల్ కూలిపోయింది. అదే సమయంలో ఓ ట్రాక్టర్ అటువైపుగా వెళ్తుండటంతో దానిపై పడింది. ఈ ఘటనలో డ్రైవర్ అహ్మద్ తలకు గాయమవగా, మరో వ్యక్తి అంజిలప్పకు తలతో పాటు కాలుకు గాయాలు అయ్యాయి. వీరిద్దరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు.



ఘటనా స్థలంలో ట్రాక్టర్

చెరువులో పడి బాలుడి మృతి



రమేష్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

తాండూరు రూరల్: చెరువులో పడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన తాండూరు మండలం ఎల్మకన్నె గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి, బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుంచెరుకుల రమేష్(12).. శనివారం సాయంత్రం అమ్మమ్మ, మామయ్య, అత్తమ్మలతో కలిసి గ్రామ సమీపంలోని బీరప్ప చెరువు సమీపంలో వంట చెరుకు కోసం ఆటోలో వెళ్లారు. రమేష్‌ను వాహనంలో కూర్చోబెట్టి చెరువు సమీపంలో చెరుకు కోసం కుటుంబ సభ్యులు వెళ్లారు. తిరిగి వచ్చి చూసేసరికి బాలుడు కనిపించలేదు. చెరువుల సమీపంలో బట్టలు కనిపించాయి. విషయం గ్రామస్తులకు చెప్పారు. రాత్రి కావడంతో ఆచూకీ లభించలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం పోలీసులు, గ్రామస్తులు చెరువు వద్దకు వెళ్లారు. చెరువులో వెతకగా బాలుడి మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

స్పీకర్ చొరవతోనే అభివృద్ధి

మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

అనంతగిరి: స్పీకర్ చొరవతోనే వికారాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు తెచ్చామని చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐదేళ్ల పాలన కాలం.. ప్రజలు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఉన్నతాధికారులు, నాయకులు, కార్యాలయం అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ సిబ్బంది సహకారంతో ముగిసిందని చెప్పారు. సమష్టి కృషితో రూ.119.81 కోట్లతో అభివృద్ధి పనులు చేశానని పేర్కొన్నారు. ఇందులో రూ.60 కోట్లు టీయూఎఫ్ఐడీసీ నిధులతో, అమృత్ 2.0లో భాగంగా రూ.12 కోట్లతో ఇదివరకే ఆయా పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. కరోనా కష్ట కాలంలో ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాని, ఆ క్షణాలు జీవితంలో మరువలేనవని పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టిన నాలుగేళ్లలో అనుకున్నంత అభివృద్ధి చేయలేకపోయినా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలో అనుకున్న నిధులు తెచ్చి అభివృద్ధిలో ముందడుగు వేశామని స్పష్టం చేశారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో మున్సిపాలిటీ రాష్ట్ర స్థాయిలో ఉత్తమంగా రాణించడంతో అవార్డులు వరించాయని గుర్తు చేశారు. ఈ ప్రాంత అభివృద్ధికి అన్ని విధాలా సహకరించిన ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.




మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

రచ్చ చేస్తున్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

కాంగ్రెస్ కౌన్సిలర్ల మండిపాటు

తాండూరు: బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు మతిభ్రమించి మాట్లాడుతున్నారని, సమావేశాలను రచ్చ చేస్తున్నారని తాండూరు మున్సిపల్ కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివారం తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కౌన్సిలర్లు రత్నమాల నర్సింహులు, నీరజాబాల్‌రెడ్డి, సైదసల్మాఫాతిమా, బాంబినా, ప్రభాకర్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, బోయర విరాజ్, వెంకన్నగౌడ్, భీంసింగ్‌రాథోడ్‌లతో పాటు పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాలలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా మనోహర్‌రెడ్డి గెలిచాక.. మున్సిపాలిటీలో ఎలాంటి గొడవలు లేకుండా పాలన సాఫీగా సాగుతోందన్నారు. ఏడాది కాలంలో ఎమ్మెల్యే సహకారంతో మున్సిపల్‌లో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లా ఎమ్మెల్యేలు కీలక పదవుల్లో ఉండటంతో అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు దూసుకుపోతుందన్నారు. మున్సిపల్ ఏర్పడిన నాటి నుంచి చైర్‌పర్సన్ స్వప్నపరిమళను అప్పటి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఆర్డీఓ అశోక్ కుమార్ ఇబ్బందులు పెట్టారని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌లోని ఆ 5మంది కౌన్సిలర్లు.. కౌన్సిల్ సమావేశం సాఫీగా సాగకుండా రచ్చ చేసేందుకే ప్రయత్నించారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌లో ఉన్న వారంతా గతంలో రోహిత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి వెంట ఉండి, ఓటమికి కారణమయ్యారన్నారు. ఇలాంటి వారు తమ పార్టీలోకి రాకుండా ఉంటే పార్టీకి మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు జలాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కౌన్సిలర్లు

చికిత్స పొందుతూ కూలీ మృతి

యాచారం: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ కూలీ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం... ఒరిశా రాష్ట్రం నౌపాడ్ ప్రాంతానికి చెందిన భగబన్(42) కొద్ది నెలలుగా ఆకులామైలారం గ్రామ సమీపంలోని ఇటుక బట్టీలో కూలీగా పనిచేస్తున్నాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటుక బట్టీలో పనిచేసే తోటి కార్మికులు భగబన్‌ను శనివారం ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు తెలిపారు.

యువతి అదృశ్యం

యాచారం: మండల పరిధిలో ఓ యువతి అదృశ్యమైన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన కావ్య(20) శనివారం మార్కెట్‌కు వెళ్లొస్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆదివారం సాయంత్రం కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహారావు తెలిపారు.

నేటితో సమాప్తం

ముగిసిన మున్సిపాలిటీ పాలకవర్గం పదవీకాలం

ఇబ్రహీంపట్నం: ఐదేళ్ల పాటు అధికారంతో కళకళలాడిన మున్సిపాలిటీలు సోమవారంతో వెలవెలబోతున్నాయి. మున్సిపల్ పాలకవర్గ పదవీకాలం ముగుస్తుంది. 2020 జనవరి 22న మున్సిపల్ ఎన్నికలు జరగగా ఓట్ల లెక్కింపు 25న చేపట్టారు. 27న చైర్మన్లు, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ఆదివారానికి పాలకవర్గ సభ్యులు బాధ్యతలు చేపట్టి ఐదేళ్లు పూర్తి కావడం గమనార్హం. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని పాలకవర్గం ప్రారంభం నుంచి పలువురు కౌన్సిలర్లు, చైర్ పర్సన్ కప్పరి స్రవంతిచందుపై అవిశ్వాసం పెట్టినా పట్టువదలని విక్రమార్కుడిలా పోరాడి పదవిని కాపాడుకుంది. ఆ కొద్ది రోజులకే వైస్ చైర్మన్ ఆకుల యాదగిరిపై కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టగా ఆయన పదవిని నిలుపుకోలేక పోయారు. అనంతరం జరిగిన వైస్ చైర్మన్ ఎన్నికలో బర్ల మంగయాదవ్ విజయం సాధించారు. దీంతో ఐదేళ్ల కాలంలో ఒక చైర్మన్, ఇద్దరూ వైస్ చైర్మన్లు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి పని చేశారు. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఎన్నో ఒడిదొడుకులను పాలకవర్గం ఎదుర్కొంది. అయితే అభివృద్ధి విషయంలో కొంత వెనుకబాటు కనిపించిందని స్థానికుల అభిప్రాయం. కాగా మున్సిపల్ ఎన్నికలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టకపోవడంతో మున్సిపాలిటీలు ప్రత్యేకాధికారుల పాలనలోకి వెళ్లనున్నాయి. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి ప్రత్యేకాధికారిగా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ నియమితులయ్యారు.

మళ్లీ వచ్చేవారెవరో

వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కొంతమంది కౌన్సిలర్లు పోటీకి విముఖత చూపుతుండగా మరికొంత మంది సుముఖత వ్యక్తం చేస్తున్నారు. రిజర్వేషన్లు, ఆయా పార్టీల టికెట్ల కేటాయింపులను బట్టి భవిష్యత్తులో ఎంతమంది తిరిగి కౌన్సిల్‌లోకి అడుగుపెడుతారో వేచి చూడాలి. పదవీకాలం ముగియడంతో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని చైర్‌పర్సన్ స్రవంతి, వైస్ చైర్‌పర్సన్ మంగ, కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలిశారు.

దళారుల ప్రమేయం లేకుండా పథకాలు

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: దళారుల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండల పరిధి చెన్‌గేస్‌పూర్ గ్రామంలో నాలుగు సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారులను ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల ఎంపిక నిరంతర ప్రక్రియన్నారు. పథకాలు అందని వారు మరోసారి దరఖాస్తు చేసుకుంటే, పది రోజుల్లో అధికారులు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. చెన్‌గేస్‌పూర్‌లో 62 మందికి కొత్త రేషన్‌కార్డులు, 66 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 201 ఇందిరమ్మ ఇళ్లు, 280 మందికి రైతుభరోసాను అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, నాయకులు ఉత్తమ్ చందు, నాగప్ప, శ్రీశైలంగౌడ్, వెంకటేశం, రాజుగౌడ్, కుర్వ మల్లప్పలు ఉన్నారు.

అర్హులందరికీ..

యాలాల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మండల పరిధి తిమ్మాయిపల్లిలో కొత్త పథకాల లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పార్టీ బీ బ్లాక్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశం ముదిరాజ్, మాజీ ఎంపీపీ పురుషోత్తంరావు తదితరులు ఉన్నారు.



తాండూరు రూరల్: చెన్‌గేస్‌పూర్‌లో పథకాల పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చేవెళ్ల: ఈర్లపల్లిలో ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- కప్పపహాడ్‌లో పథకాల ప్రారంభోత్సవం

ఇబ్రహీంపట్నం రూరల్: పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ప్రజాపాలనలో భాగంగా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కప్పపహాడ్ గ్రామంలో ఆదివారం నాలుగు పథకాలను ఎమ్మెల్యే మల్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందేశాన్ని ప్రజలకు వినిపించారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ప్రొసీడింగ్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉన్నామన్నారు. ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, గ్యాస్‌పై రూ.500 సబ్సిడీ ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అందరికీ రేషన్ కార్డులు అందించే లక్ష్యంతో ముందుకు పోతున్నామన్నారు. భూమిలేని నిరుపేదలకు ఉపాధి హామీలో 20 రోజులు పని చేస్తే ఆత్మీయ భరోసా పేరుతో ఏడాదికి రూ.12 వేలు మహిళలకు ఇస్తామని స్పష్టం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం అర్హులందరికీ పథకాలు అందించే బాధ్యత తమపై ఉందన్నారు. అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రాబోయే రోజుల్లో 20వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. ప్రాధాన్యత క్రమంలో కేటాయిస్తామన్నారు. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు.

సమావేశంలో కరెంట్ కటకట

సంక్షేమ పథకాలు అమలు కోసం కప్పపహాడ్‌లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే సమావేశానికి కరెంట్ కటకట వెంటాడింది. ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతుండగా రెండుసార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఎమ్మెల్యే అసహనానికి గురయ్యాడు. ఆ వెంటనే విద్యుత్ సరఫరా కావడంతో సభ సాఫీగా సాగింది. సమావేశంలో ఆర్డీఓ అనంతరెడ్డి, ప్రత్యేకాధికారి నవీన్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ కరుణాకర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ వెంకటమ్మ, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, సతీష్‌గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ చెందొద్దు

మంచాల: మండలంలోని లింగంపల్లి గ్రామంలో సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఎమ్మెల్యే రంగారెడ్డి ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి పేద వాడికి సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. ఎవరూ కూడా నిరాశకు గురికావొద్దని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఆర్డీఓ అనంతరెడ్డి, ఎంపీడీఓ బాల శంకర్, తహసీల్దార్ ఎంవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర ప్రక్రియ

చేవెళ్ల: సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడికి అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని ఈర్లపల్లిలో ఆదివారం ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల పంపిణీ పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు అందించటం నిరంతర ప్రక్రియని చెప్పారు. ఈర్లపల్లి గ్రామంలో మొదటి విడతగా 34 ఇందిరమ్మ ఇళ్లు, 54 రేషన్‌కార్డులు, 449 మందికి రైతు భరోసాకు సంబంధించి జాబితాలో వచ్చిన పేర్ల ప్రకారం లబ్ధిదారులకు పత్రాలను అధికారులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రకళ, ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ క్రిష్ణయ్య, ఎంపీడీఓ హిమబిందు, ఏఓ శంకర్‌లాల్, మాజీ సర్పంచులు రాజశేఖర్, నర్సింలు, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్ పాల్గొన్నారు.

మాది చేతల ప్రభుత్వం

షాబాద్: కాంగ్రెస్ చేతల ప్రభుత్వమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలో ఏట్ల ఎర్రవల్లి గ్రామంలో ప్రజా పాలనలో భాగంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్తరేషన్ కార్డులు 4 సంక్షేమ పథకాలను అధికారికంగా ప్రారంభించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేశారు.